క్లుప్తంగా

మాజీ జెడ్పీటీసీని కలిసిన కర్నూల్ మేయర్

శాంతినగర్: వడ్డేపల్లి మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులును కర్నూల్ మేయర్ రామయ్య ఆదివారం శాంతినగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కర్నూలు, జోగుళాంబ గద్వాల జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి చర్చించుకున్నారు. అనంతరం తేనేటి విందులో పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

రాజోళి: తుమ్మిళ్ల ఎత్తిపోతల కింద రిజర్వాయర్లు నిర్మించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా రైతులకు నీరందించేందుకు అవసరమైన రిజర్వాయర్లను వదిలిపెట్టి, వాటిని నిర్మించకుండా, కాలయాపన చేసిందన్నారు. దీంతో ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందడం లేదని తెలిపారు. గతేడాది కురిసిన వర్షాలను చెరువుల ద్వారా ఒడిసిపట్టుకుంటే, గడ్డు కాలంలో పనికి రావడంతో పాటు, పరిసర గ్రామాలకు భూగర్భ జలాలు పెరిగేవని తెలిపారు. ఇప్పుడు ఒకవైపు రైతుల పొలాలు ఎండిపోతుంటే, రాజకీయాలు చేస్తున్నారు తప్ప, రైతులకు మేలు చేయాలనే ఆలోచన అధికార పార్టీలో లేదని ఆయన ఆరోపించారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక



కేటీదొడ్డి: ధరూర్ మండలంలోని చింతరేవుల గ్రామంలో సోమవారం మాదిగ విశ్వరూప జిల్లా మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బండారి డేవిడ్ తెలిపారు. ఆదివారం ఆయన కేటీదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నవంబర్ 18న హైదరాబాద్‌లో మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు మండల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంబయ్య, నాయకులు తాయప్ప, కర్రెప్ప, రాజు, హనుమంతు, నర్సింహులు, తిరుమల్ ఉన్నారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. ఆదివారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్ పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని తనిఖీ నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణకు మద్యం, డబ్బు రాకుండా అధికారులు గట్టి బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది చక్రవర్తి, ఐటీబీపీ పోలీసు సిబ్బంది ఉన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో..

అలంపూర్ రూరల్: మండలంలోని ర్యాలంపాడ్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. అటు ఆంధ్ర ప్రాంతానికి చివర, ఇటు తెలంగాణ ప్రాంతానికి మొదలు కావడంతో చెక్ పాయింట్ వద్ద పోలీసులు ప్రతి వాహనాన్ని సోదా చేసి పంపుతున్నారు.

పశు వైద్యశాల భవనం నిర్మించండి

రాజోళి: మండల కేంద్రం రాజోళిలో పశువైద్యశాలను నిర్మించాలని పాడి రైతులు కోరుతున్నారు. గత కొన్ని ఏళ్ల కిందట నిర్మించిన భవనంలోనే కాలం వెల్లదీస్తుండగా, అది పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అందులో పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయి. సిబ్బంది అందులో విధులు నిర్వహించాలంటే భయపడుతున్నారు. మండల కేంద్రం ఏర్పాటయ్యాక కూడా నూతన భవనం నిర్మించకపోవడం దురదృష్టకరమని, అధికారులు, నాయకులు దీనిపై స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని ఆయా గ్రామాల పాడి రైతులు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలి

ఉండవెల్లి: ధరూర్ మండలం చింతరేవులలో నిర్వహించే ఎమ్మార్పీఎస్ సన్నాహక సభ సోమవారం నిర్వహిస్తున్నామని, సభను విజయవంతం చేయాలని జిల్లా సీనియర్ నాయకులు ఏలిషా ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డ్రెయినేజీల నిర్మాణమెప్పుడో?

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లోని అంతర్గత రహదారులకు ఇరువైపుల డ్రెయినేజీలు ఎప్పుడు నిర్మిస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. రోడ్లపై గుంతలు ఏర్పడి ఇళ్ల నుంచి వచ్చే నీళ్లు నిలుస్తున్నాయని, సీసీ రోడ్లు వేసిన చోట డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో రోడ్లపై మురుగు నీరు నిలిచి కంపు కొడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల వెంట కాల్వలు నిర్మించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కంకర రోడ్డుతో కష్టాలు

- శిథిలమైన అయిజ–ఎక్లాస్‌పురం రోడ్డు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు, పాలకులు



ఎక్లాస్‌పురం శివారులో మరమ్మతులకు నోచుకోని రోడ్డు

అయిజ: గతంలో అయిజ మండల కేంద్రం నుంచి గట్టు మండల కేంద్రానికి రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన బీటీ రోడ్డు శిథిలమైంది. రోడ్డు శిథిలమై సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోలేదు. గతేడాది రూ. 1.20 కోట్లతో గట్టు మండల కేంద్రంతో పాటు మండలంలోని గొర్లకాన్ దొడ్డిలో సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో అయిజ నుంచి ఎక్లాస్‌పురం వరకు శిథిలమైన బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారు. సీసీ నిర్మాణం పనులు పూర్తయినా, బీటీ రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయకపోవడంతో గట్టు, అయిజ మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

కంకర వేసి నిర్మాణం మరిచారు..

గట్టు, అయిజ రెండు మండలాల మధ్య ఉన్న బీటీ రోడ్డు శిథిలం కావడంతో మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డుపై ప్యాచ్ వర్క్ చేసేందుకు రెండు నెలల క్రితం రోడ్డుపై శిథిలాలను తొలగించి కంకర పరిచారు. ఇంతవరకు పనులు పూర్తి చేయకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై వెళ్లేందుకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు కంకరపై అదుపుతప్పి కిందపడిపోతున్నాయి. ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. ప్యాచ్ వర్క్ పనులు త్వరగా పూర్తి చేయాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నా, అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదు.

పనులు త్వరలో పూర్తి చేస్తాం..

రెండు మండలాల మధ్య ఉన్న అయిజ–ఎక్లాస్‌పురం రోడ్డు శిథిలం కావడంతో రోడ్డుకు మరమ్మతు చేసేందుకు ప్యాచ్ వర్క్ చేయిస్తున్నాం. శిథిలమైన రోడ్డుపై కాంట్రాక్టర్ కంకర వేయించారు. గట్టు, గొర్లకాన్‌దొడ్డిలలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయి. త్వరలో పనులు పూర్తి చేసేందుకు కృషిచేస్తాం.

– మహేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ

రోడ్డు శిథిలమై చాలా కాలమైంది



అయిజ నుంచి గట్టు మండలానికి ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు శిథిలమై చాలా కాలమైంది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని రెండు మండలాల ప్రజలు అధికారులను, ప్రజలను వేడు కుంటే ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభించారు. ఇంతవరకు పనులు పూర్తి చేయలేదు. రోడ్డుపై ప్రయాణించడానికి చాలా ఇబ్బందిగా ఉంది.

– తిమ్మప్ప, ఎక్లాస్‌పురం

రోడ్డుపై కంకర వేసి మరిచారు..



శిథిలమైన రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు రెండు నెలల క్రితం రోడ్డుపై శిథిలాలను తొలగించారు. గుంతల్లో కంకర వేశారు. బీటీ రోడ్డుపై మరమ్మతు పనులు ఇంతవరకు పూర్తి చేయకపోవడంతో రెండు మండలాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు రోడ్డు నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– మహబూబ్ బాషా, అయిజ

ప్రమాదాలు జరుగుతున్నాయి..



రోడ్డుపై అనేక చోట్ల శిథిలాలను తొలగించి వాటి స్థానంలో కంకర వేసి వదిలేశారు. కనీసం కంకరపై రోడ్డు రోలర్ కూడా తిప్పలేదు. కంకరపై ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ప్రతికూలంగా మారింది. వాహనాలు అదుపుతప్పి అనేకసార్లు ప్రమాదాలు జరిగాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలి.

– దేవేంద్ర, సింధనూరు

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమాభివృద్ధి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ధరూరు, మల్దకల్, గద్వాల మండలాల్లోని వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.

బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి..

గట్టు: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీజేపీ నాయకులు రాజప్ప, శివప్ప, తిమ్మప్ప, జీపు తిమ్మప్ప, హోటల్ మల్లయ్య, భీమన్న, చాకలి నర్సింహులు, బోయ లక్ష్మన్న, రాయన్నతో పాటుగా మరి కొంత మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అంతకు ముందు గట్టులో నాయకులు ర్యాలీగా గద్వాలకు బయలు దేరి వెళ్లారు.

అర్హులందరికీ ఫలాలు

బీఆర్‌ఎస్ పాలనలో అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందించామని, గట్టు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి, బీడు భూములకు సాగు నీటిని అందిస్తామని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, ఎమ్మెల్యే కుమారుడు బండ్ల సాయిసాకేత్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం రాయాపురం, జోకన్‌గట్టు, తారాపురం గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు ప్రవీన్‌కుమార్, ఎంపీటీసీ రంగస్వామి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడు, బీఆర్‌ఎస్ నాయకులు రాముడు, వీరేష్, రాముునాయుడు, వెంకటేష్ సంతోష్ పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే అన్నారు. గద్వాల మండలంలోని వెంకంపేట, నదిఅగ్రహారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ ఉన్నారు.

కేటీదొడ్డి: ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని బీఆర్‌ఎస్ పార్టీకి మరోమారు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి అన్నారు. మండలంలోని గువ్వలదిన్నె, తూర్పుతండా, పూజారితండా గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

పుట్టిని కాల్చేసిన దుండగులు

జోగుళాంబ శక్తిపీఠం: ప్రతి రోజు అలంపూర్ ఆలయాలకు దర్శనం కోసం వచ్చే భక్తులు సరదగా కాలక్షేపం కోసం పుష్కరఘాట్ దగ్గర తుంగభద్ర నదిలో పుట్టి ప్రయాణం చేస్తుంటారు. అలా నదిలో పుట్టి ప్రయాణానికి తీసుకెళ్తూ పొట్టపోసుకుని బతుకుతున్న నేరెడబోయిన రాముడికి చెందిన పుట్టిని గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి తగులబెట్టారు. ఉదయం నది వద్దకు వెళ్లిన రాముడు తగలబడి ఉన్న పుట్టిని చూసి పుట్టెడుదుఃఖంతో కుంగిపోయాడు. తనకు జరిగిన అన్యాయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నాడు. గతంలో కూడా ఇలాంటి పుట్టిలను తగుల బెట్టిన సంఘటనలు తుంగభద్ర నది ఒడ్డున చాలా ఉన్నాయి.



తగలబెట్టిన పుట్టి

సీట్ల కేటాయింపులో ముస్లింలకు అన్యాయం



మాట్లాడుతున్న అతిఖుర్ రహ్మాన్

గద్వాల అర్బన్: మూడు ప్రధాన పార్టీల మేనిఫెస్టోలలో ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అంశాలు పొందుపర్చకుండా తీవ్ర అన్యాయం చేశారని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అతిఖుర్ రహ్మాన్ మండిపడ్డారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన ముస్లింలకు కనీసం 15నుంచి 18ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో మైనారీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. మైనార్టీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని, విద్య, ఉపాధి కల్పించడంతో పాటు వక్ఫ్‌బోర్డు ఆస్తులపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇజ్రాయిల్ దాడులపై నిరసన



గట్టులో నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ఐద్వా సంఘం నాయకులు

గట్టు: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు నిరసనగా మండల కేంద్రంలో ఆదివారం సీఐటీయూ కార్మిక సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 20 రోజులుగా పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతోందని, వైమానిక దాడుల వల్ల 6 వేల మంది మృతి చెందినట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద పేర్కొన్నారు. యుద్ధం వల్ల దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు స్వామి, నగేంద్ర, నర్సింహ, శాంతన్న, ఏసు, స్వామి, గోవిందు, రాముడు, జగన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్సీ

మానవపాడు: మండలంలోని పెద్ద పోతులపాడులో సర్పంచ్ పరిమళాదేవి కుమారుడు నాగిరెడ్డి గుండె పోటుతో వారం రోజుల క్రితం మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే వీఎం అబ్రహం వేర్వేరుగా పరామర్శించారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల ప్రచార శంఖారావం



అలంపూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల ప్రచార శంఖారావం ఉన్నట్లు బీఎస్పీ సీనియర్ నాయకులు మహేష్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అలంపూర్ నుంచి బీఎస్పీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు సర్వమత ప్రార్థనలు చేసి ఎన్నికల ప్రచారం ఆరంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్య అందాలంటే బీఎస్పీ జెండా ఎగరేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కనకం బాబు, నాయకులు సుంకన్న, సురేష్, దేవరపోగు నాగరాజు, సుధాకర్, నాగరాజు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో డీటీ లేక ఇబ్బందులు

ఉండవెల్లి: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలోని డీటీ జయంతికి ప్రమోషన్ రావడంతో గద్వాల్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో ఆ స్థానంలో ఎవరు రాకపోవడంతో ఖాళీగా ఉంది. ఎన్నికల సమయంలో కొత్తగా వచ్చిన తహసీల్దార్ వెంకటరావు జిల్లాలోని సమావేశాలకు వెళ్తున్న సమయంలో రిజిస్ట్రేషన్లు చేయడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డీటీని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ధరూరు: మండలంలోని కోతులగిద్దలో ఆదివారం పాగుంటన్న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గద్వాల కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, జాకీర్, శ్రీనివాసరావు, శ్రీకాంత్‌రెడ్డిలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మాజీ సర్పంచులు రంగన్న, జమ్మన్న, రంగస్వామి గౌడ్, నాగన్న, గోవిందు జంగిలప్ప ఉన్నారు.

షాదీఖానాకు అరకొర నిధులు

అయిజ: పట్టణంలోని నల్లమజీద్ వద్ద రూ.40 లక్షలతో నిర్మిస్తున్న షాదీఖాన నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. షాదీఖాన నిర్మాణానికి ఎమ్మెల్యే అబ్రహం నిధుల నుంచి రూ.25 లక్షలు, డిప్యూటీ సీఎం మహ్మద్ అలీ నిధుల నుంచి రూ.15 లక్షలు విడుదల చేశారు. పునాదిపై గోడలు, పైభాగాన రేకుల షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదని ముస్లిం పెద్దలు వాపోతున్నారు. సరిపడా నిధులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

బాధితులకు చేయూత అందిస్తాం



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

గద్వాల క్రైం: పట్టణంలోని పిల్లిగుండ్ల కాలనీలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి గుడిసె దగ్ధమైన ఘటనలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జరిగిన ఘటన చాలా బాధాకరమన్నారు. కృష్ణమ్మ కుటుంబ అవసరాలకు తన వంతు సాయం అందిస్తామన్నారు. ప్రమాదంపై సంబంధిత కంపెనీ నిర్వాహకులతో మాట్లాడి ఇన్స్‌రెన్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇల్లు నిర్మాణం కోసం ఆర్థిక పరమైన సహాయం చేకురుస్తామన్నారు. ఆమె వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్



ప్రజలతో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని ఆయా వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం ఆదివారం జోరుగా కొనసాగింది. కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ ఆయన సతీమణి మహాలక్ష్మి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. సోనియమ్మ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



మౌనం పాటిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

రాజోళి: మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శ్రీరామ్ రెడ్డి లేనిలోటు తీర్చలేనిదని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీరామ్‌రెడ్డి నివాసంలో కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. పార్టీ నాయకుడిగా, ప్రజా సేవకుడిగా శ్రీరామ్‌రెడ్డి ఎనలేని సేవలందించారని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్‌డీఎస్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, మూగెన్న, ఎంపీటీసీ షాషావలి, గంగిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నడిగడ్డలో బహుజన జెండా ఎగరాలి



గార్లపాడులో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

ధరూరు: ఏడు దశాబ్దాలుగా ఒకే కుటుంబ పాలన కారణంగా వెనుకబాటుకు గురవుతున్న నడిగడ్డ ప్రాంత ప్రజల జీవితాలు మారాలంటే బహుజన జెండా ఎగరాలని పోరాట సమితి జిల్లా చైర్మన్, అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ (ఏఐఎఫ్‌బీ) ఎమ్మెల్యే అభ్యర్థి గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని ఖమ్మంపాడు, గార్లపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు కేటాయించిన సింహం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వచ్చే నెల 30న జరిగే ఓటింగ్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన బలమైన ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు బుచ్చిబాబు, లవన్న, గోవిందు, పరుశరాం,అవనిశ్రీ, జగదీష్, మునెప్ప, వెంకటేష్, సర్వేష్, రాము, ఈశ్వర్, నాగేంద్ర పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ట్యాంకుల వద్ద పిచ్చిమొక్కలు



జూలెకల్ ఓవర్‌హెడ్ ట్యాంకు ముళ్లపొదలు

శాంతినగర్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఫిల్టర్ నీరు అందిస్తున్న మిషన్‌భగీరథ ట్యాంకుల వద్ద పిచ్చిమొక్కలు పెరిగినా అధికారులకు పట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. వాటర్ ట్యాంకుల చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడం, లీకేజీ, ఓవర్ ఫ్లో అయిన నీరు గుంతల్లో నిలిచి దోమలు, ఈగలు, పందులకు నిలయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ట్యాంకుల మూతల వద్ద దోమలు, ఈగలు ప్రవేశించి నీరు కలుషితం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు, గ్రామ పంచాయతీ సెక్రటరీలు స్పందించి ఉపాధి హామీ సిబ్బందితో ట్యాంకుల పరిసరాలను శుభ్రం చేయించి ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముళ్ల కంపను తొలగించండి



కొత్త రాజోళిలో గృహాల మధ్య ముళ్ల పొదలు

రాజోళి: మండల కేంద్రంలోని పునరావసంలో నిర్మించిన వరద గృహాల మధ్య ముళ్ల పొదలు గుంపుగా పెరిగిపోయాయని, వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పునరావాసంలో చాలా ఇళ్లలో ఇప్పటికీ ఎవరూ చేరకపోవడం, ఇళ్లు అసంపూర్తిగా నిర్మించడంతో, వాటి చుట్టు పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరుగుతున్నాయి. దీంతో ఆ చుట్ట పక్కల పరిసరాలల్లో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడటంతో పాటు, విష సర్పాలు సంచరిస్తున్నాయి. చీకటి సమయాల్లో మరింత ఇబ్బందికరంగా ఉంటుందని, పగటి సమయాల్లో కూడా మద్యం బాబులు వాటిని అడ్డాగా మార్చుకుంటున్నారని పేర్కొన్నారు. వాటిని తొలగిస్తే ఇళ్ల మధ్య పరిసరాలు పరిశుభ్రంగా మారతాయని స్థానికులు పేర్కొన్నారు.

గ్రామీణ రహదారులు అధ్వానం



చింతరేవుల - మాన్నపురం రోడ్డుపై గుంతలు

ధరూరు: గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మండలంలోని మన్నాపురం నుంచి గుడ్డెందొడ్డి, మాల్‌దొడ్డి గ్రామాలకు వెళ్లే రోడ్డుతో పాటు మన్నాపురం నుంచి చింతరేవుల మీదుగా వయా జూరాల డ్యాం మీదుగా ఆత్మకూరు, అమరచింత, నారాయణపేట ప్రాంతాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి. ఏళ్ల తరబడిగా రోడ్లు గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా, పట్టించుకునే వారు కరువయ్యారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రాకపోకలు కొనసాగించాలంటేనే భయపడుతున్నారు. తేలిపోయిన కంకర రాళ్లతో వాహనాలు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నేడు నిరుద్యోగుల ర్యాలీ

శాంతినగర్: బంగారు తెలంగాణలో నిరుద్యోగ బతుకులు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నిరుద్యోగ సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఉదయం 11గంటలకు సమావేశం, అనంతరం ఐలమ్మ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. నిరుద్యోగులు హాజరు కావాలన్నారు.